తుపాను కలవరం.. అంతటా అప్రమత్తం

- మిచాంగ్ నేపథ్యంలో పూర్తిగా మారిన వాతావరణం
- హడావుడిగా యంత్రాలతో వరి కోతలు



కోడూరులో ధాన్యాన్ని సంచులకు ఎత్తుతున్న రైతులు

కోడూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన 'మిచాంగ్' తుపాను రైతుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. వరి పంట చేతికొచ్చే సమయంలో తుపాను బలపడి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖాధికారులు హెచ్చరికలు జారీ చేయడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు చెప్పిన విధంగానే శనివారం మధ్యాహ్నం నుంచి వాతావరణం పూర్తిగా మారిపోయింది. ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకొని చిరుజల్లులు కూడా పడ్డాయి. ఈదురుగాలుల తీవ్రత పెరిగింది. ఆరుగాలం కష్టపడి పండించిన వరిపంటను కాపాడుకునేందుకు రైతులు ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించారు. కోడూరు మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సుమారు 16,500 ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా తీరప్రాంత గ్రామాల్లో వరినాట్లు ఆలస్యంగా జరిగాయి. దీంతో ఈ ప్రాంతాల్లో రైతులు నెల రోజుల కిందటే వరి నాట్లు పూర్తి చేశారు. ఇక ఎగువ ప్రాంతాలైన మాచవరం, జయపురం, వి.కొత్తపాలెం, లింగారెడ్డిపాలెం, విశ్వనాథపల్లి, కోడూరు, పోటుమీద, నక్కవానిదారి, పిట్టల్లంక ప్రాంతాల్లో వరిపంట కోతకు సిద్ధమైంది. సుమారు 50 శాతం పంటను మరో నాలుగు రోజుల్లో రైతులు కోతలు కోసేందుకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో తుపాను ఏర్పడడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

గాలులకు నెలవారిన వరి పంట..

ప్రస్తుతం పైరు ఏపుగా పెరగడంతో ఈదురు గాలులకు పలు ప్రాంతాల్లో పంట నెలవారింది. ఇప్పటి వరకు ఏవిధమైన నష్టం లేకపోయినా పడిపోయిన పంటపై వర్షం నీరు నిలిస్తే కోసేందుకు కూడా ఉపయోగపడదని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కొంతమంది రైతులు పంటను కాపాడుకునేందుకు వరిగడ్డి అవసరమైనప్పటికీ యంత్రాల సాయంతో కోతలు ప్రారంభించారు. కోతలు పూర్తి చేసి ధాన్యాన్ని బస్తాల్లో ఎత్తి భద్రపర్చుకున్నారు. మరికొంతమంది రైతులు యంత్రాలతో నూర్పిడి చేసిన ధాన్యంలో తేమ శాతం ఎక్కువగా ఉండడంతో పరదాలపై వాటిని ఆరబెట్టారు.



యంత్రాలతో వరి కోతను కోయిస్తున్న రైతులు



ధాన్యం రాశులపై పరదాలు కప్పిన రైతు

అవగాహన కల్పించిన వ్యవసాయాధికారులు..

తుపాను నేపథ్యంలో వరికోతలు వద్దంటూ వ్యవసాయ అధికారులు గ్రామాల్లో విస్తృత ప్రచారం చేశారు. యంత్రాల సాయంతో కోసిన వరిపంటను భద్రపర్చుకోవాలని ఏఓ శ్రీధర్ సూచించారు. ఆర్‌బీకేల్లో రైతులు తమ ధాన్యాన్ని విక్రయించుకోవాలన్నారు. పనలపై ఉన్న వరి పంటను వెంటనే కుప్పలు వేసుకోవాలని ఏఓ సూచించారు.

- **కృత్తివెన్ను:** తుపాను హెచ్చరికలతో వరి కోతలు పూర్తిచేసిన వారు తమ పంటను కాపాడుకునే ప్రయత్నాలను ముమ్మరం చేశారు. పంటతో పాటు భవిష్యత్‌లో పశుగ్రాసం కొరత లేకుండా ఉండేందుకు యంత్రాలతో కోతలు పూర్తిచేసిన వరిగడ్డిని సైతం రైతులు హడావుడిగా భద్రపరుచుకుంటున్నారు. వేటకు వెళ్లిన మత్స్యకారులు తుపాను హెచ్చరికలతో ఒడ్డుకు చేరుకుంటున్నారు. మరో రెండు రోజుల పాటు రైతులంతా వరికోతలు కోయరాదని అధికారులు హెచ్చరిస్తున్నారు.
- **మోపిదేవి:** కోస్తాంధ్రపై మిచాంగ్ తుపాను ప్రభావం ఉంటుందని అధికారుల హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరికోత కోసిన రైతులు కుప్పలు వేస్తుండగా, మిషన్ ద్వారా నూర్పిడి చేసిన ధాన్యాన్ని సంచుల్లోకి ఎత్తి ఆర్‌బీకేల ద్వారా రైతులు మిల్లర్లకు తరలించే పనిలో నిమగ్నమయ్యారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల ధాన్యం దెబ్బతినకుండా తేమశాతాన్ని సడలించి ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. తుపాను ప్రభావం ఈ నెల 2వ తేదీ నుంచి 5వ తేదీ వరకు ఉంటుందని, ఈ సమయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారులు హెచ్చరించారు.



కృత్తివెన్ను మండలం గాంధీనగర్‌లో పశుగ్రాసాన్ని భద్రపరుచుకుంటున్న రైతులు

- **నాగాయలంక:** మండలంలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. పంట దిగుబడి బాగుందని రైతులు ఉత్సాహంతో ఉండగా తుపాను హెచ్చరికలతో ఆందోళన చెందుతున్నారు. వర్షం పడితే నోటి దగ్గరకు వచ్చిన పంట దెబ్బతింటుందని ఆవేదన చెందుతున్నారు. తుపాను తీవ్రత పెరిగి ఈదురు గాలులు వీస్తే విద్యుత్ పరికరాలు, తీగలు తెగిపడే ప్రమాదం ఉందని, ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ శాఖ ఏఈఈ జి.ఏడుకొండలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని విద్యుత్ సిబ్బంది వివరాలను మొబైల్ నంబర్లతో సహా ఆయన సామాజిక మాధ్యమాలు, మీడియా గ్రూపుల్లో వైరల్ చేశారు. మండల రెవెన్యూ కార్యాలయం కేంద్రంగా రెవెన్యూ సిబ్బంది తుపాను విధుల్లో సిబ్బంది సిద్ధంగా ఉన్నారని, మండల ప్రజలు, రైతులు ముందస్తు జాగ్రత్తలతో అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జె.విమలకుమారి తెలిపారు.

క్లుప్తంగా

స్వామి వారికి వెండి నాగపడగ సమర్పణ



మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి విశాఖపట్నానికి చెందిన భక్తులు తుమ్మపూడి రమేష్‌బాబు కుటుంబ సభ్యులు వెండి నాగ పడగను సమర్పించారు. శనివారం ఉదయం స్వామి వారిని దర్శించుకున్న అనంతరం ఆలయ ఏసీ ఎన్‌ఎస్ చక్రధరరావుకు వెండి నాగ పడగను అందజేశారు. 556 గ్రాముల వెండితో సుమారు రూ.68 వేలతో తయారు చేయించామని దాత రమేష్‌బాబు తెలిపారు. దాత కుటుంబ సభ్యులను ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఐక్య క్రిస్మస్ వేడుక

పెడన: పెడన మార్కెట్ యార్డు ఆవరణలో ఆదివారం సాయంత్రం జరిగే ఐక్య క్రిస్మస్ వేడుకను జయప్రదం చేయాలని పెడన మండల పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగిశెట్టి డానియేలు అన్నారు. ఐక్య క్రిస్మస్ వేడుకకు సంబంధించిన కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. డానియేలు మాట్లాడుతూ విశిష్ట అతిథిగా రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, యేసయ్య దీవెన టీవీ వర్తమానికులు పాస్టర్ ఎం. జ్యోతిరాజు, స్తుతి ఆరాధన సిస్టర్ హేన విమల్ హాజరవుతారని చెప్పారు. పెడన నియోజకవర్గ వ్యాప్తంగా పెడన, గూడూరు, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని దైవజనులంతా పాల్గొనాలని కోరారు.

సకలేశ్వరునికి లక్ష బిల్వార్చన

మోపిదేవి: మోపిదేవిలోని సకలేశ్వరస్వామి వారి దేవస్థానంలో శనివారం లక్ష బిల్వార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, కలశస్థాపన, మండపారాధన, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మారేడు దళాలతో పూజా కార్యక్రమాలు జరిగాయి. అనంతరం పంచ హారతులు, తీర్థప్రసాద వినియోగం నిర్వహించారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

బంటుమిల్లి: ముదినేపల్లి మండలం వణుదుర్రు పంచాయతీ శివారు కొత్తపల్లి గ్రామానికి చెందిన పుర్రిళ్ల జ్ఞానేశ్వరి (21) ఏలూరు జిల్లాలోని ఆశ్రం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. మృతురాలు బంటుమిల్లిలోని ఆటోమొబైల్ షాపులో వర్కర్‌గా పనిచేస్తూ స్వగ్రామం నుంచి రాకపోకలు చేస్తున్నది. ఈ క్రమంలో షాపు యజమానితో ఏర్పడ్డ మనస్పర్థల నేపథ్యంలో కొద్ది రోజుల కిందట ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆశ్రం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఇచ్చిన మరణ వాంగ్మూలాన్ని పురస్కరించుకుని మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు బంటుమిల్లి పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు.

బేడ బుడగ జంగం జిల్లా అధ్యక్షుడిగా నాంచారయ్య

పెడన: బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి కృష్ణా జిల్లా అధ్యక్షుడిగా సిరిగిరి నాంచారయ్య నియమితులయ్యారు. శనివారం స్థానిక సంఘ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎలమర్తి మధు, ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షుడు ఎస్. వెంకటేశ్వరరావులు నియామక పత్రాన్ని నాంచారయ్యకు అందజేశారు. నాంచారయ్య ఆధ్వర్యంలో జిల్లా కమిటీలో ఇతర సభ్యులను నియమించుకోవడంతో పాటు మండల స్థాయిలో కమిటీలను వేయాల్సి ఉంటుందని రాష్ట్ర నాయకులు తెలిపారు.

విజయవాడ వెళ్లి పింఛను అందజేత

మచిలీపట్నంటౌన్: 11వ డివిజన్‌కు చెందిన పింఛనుదారుడు అవనిగడ్డ నాగేశ్వరరావుకు గుండెపోటు రావటంతో విజయవాడలోని సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. నాగేశ్వరరావుకు వలంటీర్ ఎం. నవీన్ విజయవాడ ఆస్పత్రికి వెళ్లి పింఛను సొమ్మును అందజేశారు. వైఎస్సార్ సామాజిక పింఛన్ల పంపిణీలో మచిలీపట్నం నగర పాలక సంస్థ జిల్లాలో ద్వితీయ స్థానం సాధించింది.

ధాన్యం తరలింపునకు కసరత్తు

గూడూరు: మంత్రి జోగి రమేష్ ఆదేశాల మేరకు కోత కోసిన పంటను మిల్లులకు తరలించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. తహసీల్దార్ బి.విజయప్రసాద్, మండల వ్యవసాయ శాఖాధికారి జి.వి.శివప్రసాద్, సహకార అధికారి విజయకుమార్ ఉదయం నుంచి ధాన్యం రాశుల దగ్గరే ఉండి లోడులు ఎత్తిస్తున్నారు. బందరు ఆర్డీఓ ఎం.వాణి క్షేత్రస్థాయిలో పర్యటించి అధికారులకు మార్గదర్శకాలు ఇచ్చారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

చల్లపల్లి: తుపాను నేపథ్యంలో విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ చల్లపల్లి సబ్ డివిజన్ డీఈఈ పులి శివ నాగేశ్వరరావు అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చల్లపల్లిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. వినియోగదారులు సమస్యలను 94910 52179 నంబరుకు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు.

రేపు కౌన్సిల్ సమావేశం

మచిలీపట్నంటౌన్: నగర పాలక సంస్థ సర్వసభ్య సమావేశం సోమవారం జరుగుతుందని మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాల్‌లో సమావేశం ప్రారంభమవుతుందన్నారు. 23 అంశాలతో ఉన్న అజెండాపై చర్చిస్తామన్నారు.కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

వైఎస్సార్ బీమా అందజేత

కోనేరుసెంటర్: చిట్టిపాలెం గ్రామానికి చెందిన దిడ్డి రవిబాబు (46) అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. వైఎస్సార్ బీమా కింద తక్షణ సహాయంగా మట్టి ఖర్చుల నిమిత్తం అతని కుటుంబానికి రూ. 10 వేలను శనివారం వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జి చండిక అజయ్ చేతుల మీదుగా మృతుని కుటుంబానికి అందజేశారు. గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అధికారుల పర్యటన

కోడూరు: తుపాను హెచ్చరికల నేపథ్యంలో తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషా, ఎంపీడీఓ శ్రీనివాసరావు కోరారు. మండలంలోని హంసలదీవి, పాలకాయతిప్ప, ఇరాలి, ఊటగుండం, రామకృష్ణాపురం గ్రామాల్లో అధికారులు పర్యటించి, గ్రామస్తులకు తుపానుపై అవగాహన కల్పించారు. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఈదురుగాలుల తీవ్రత అధికంగా ఉంటుందని తహసీల్దార్, ఎంపీడీఓ తెలిపారు. గ్రామసులు పక్కా భవనాల్లో నివాసముండాలని, పూరి గుడిసెలు, రేకుల ఇళ్లల్లో ఉండవద్దనానరు. తుపాను షెల్టర్లను కూడా వినియోగించుకోవాలన్నారు. కోడూరు తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను కూడా ఏర్పాటు చేశామని చెప్పారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, గ్రామాల్లో ఉండి సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు పంపాలని తహసీల్దార్, ఎంపీడీఓ ఆదేశించారు.

మేలు జరిగితేనే ఆశీర్వదించండి

- గడప గడపకు మన ప్రభుత్వంలో మంత్రి జోగి రమేష్
- నీలిపూడిలో రహదారుల నిర్మాణానికి హామీ



సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి జోగి రమేష్

కృత్తివెన్ను: ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని, ప్రజల కోసం ఎంతో మేలు చేస్తున్న జగనన్నను మరోసారి నిండు మనస్సుతో ఆశీర్వదించాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ కోరారు. కృత్తివెన్ను మండలం నీలిపూడి గ్రామంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మంత్రి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని సంక్షేమ పథకాలను వివరించారు.

మేలు చేశాం కాబట్టే మద్దతు కోరుతున్నాం..

ముఖ్యమంత్రిగా జగనన్న ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుండి ఇప్పటి వరకు మీ ఇంటికి ప్రభుత్వం నుంచి ఏదైనా సంక్షేమ పథకం అంది మీకు మేలు జరిగిందని భావిస్తేనే మీరు మళ్లీ తిరిగి జగనన్నను ఆశీర్వదించాలని మంత్రి ప్రజలను కోరారు. దేశ చరిత్రలో ఇటువంటి సంక్షేమం, అభివృద్ధి అందించిన ముఖ్యమంత్రి ఏ రాష్ట్రంలోనూ లేరని చెప్పారు. మేలు చేశాము కాబట్టే మళ్లీ మీ ఇంటికి వచ్చి ఆశీర్వాదం కోరుతున్నామన్నారు.

రోడ్ల నిర్మాణానికి హామీ..

అంతర్గత రోడ్లు నిర్మించాలని పలువులు మహిళలు మంత్రిని కోరగా పంచాయతీరాజ్ ఏఈఈ నగేష్‌ను పిలిచి వారు అడిగిన రోడ్లకు అంచనాలు తయారు చేయాలని మంత్రి సూచించారు. ప్రధాన మార్గం నుండి సబ్ సెంటర్‌కు, ప్రస్తుత పంచాయతీ కార్యాలయానికి వెళ్లే మార్గానికి సీసీ రోడ్లు నిర్మాణం చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. మిగిలినవి కూడా అంచెలంచెలుగా పూర్తిచేస్తానన్నారు.

సీతారామస్వామికి పరామర్శ

తొలుత మునిపెడ గ్రామంలో ఏపీ కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పిన్నెంటి మహేష్ నివాసం వద్ద మంత్రి కొద్ది సేపు ఆగారు. మహేష్ తండ్రి, సీనియర్ నాయకుడు పిన్నెంటి సీతారామస్వామి (చినబాబు) అనారోగ్యంతో ఉండటంతో ఆయనను మంత్రి పరామర్శించారు. అనంతరం మహేష్‌తో పాటు స్థానికులు మంత్రికి పూలమాలలు వేసి, దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్, జెడ్పీటీసీ మైల రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ కొల్లాటి గంగాధర్, పార్టీ మండల కన్వీనర్ వైదాని వెంకట్రాజు, సర్పంచ్ పాశం కృష్ణ, ఎంపీటీసీ సుజాత, నాయకుడు పాశం సుబ్రహ్మణ్యేంద్రరావు, ఎంపీడీఓ పిచ్చిబాబు, తహసీల్దార్ రామకోటేశ్వరరావు, కార్యదర్శి ఉమామహేశ్వరి, అగ్రికల్చరల్ జిల్లా బోర్డు సభ్యులు పట్టపు నాని, కృత్తివెన్ను పీఏసీఎస్ చైర్మన్ లకోష్మీజీ, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ జాన్‌రత్నం, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణలో నిబంధనల సడలింపు

అవనిగడ్డ: తుపాను, వర్షాల వల్ల రైతులు నష్టపోకుండా ఉండేందుకు ధాన్యం కొనుగోలు సేకరణలో కొన్ని సడలింపులు చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు సంబంధిత అధికారులకు ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. వీటిపై రైతులకు అవగాహన పెంచేందుకు అధికారులు పొలంబాట పట్టారు.

సడలించిన నిబంధనలు..

- గతంలో 20 శాతం లోపు తేమ ఉంటేనే రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసేవారు. తుపాను నేపథ్యంలో తేమ శాతం 25 ఉన్నా కొనుగోలు చేస్తున్నారు.
- గతంలో జీపీఎస్ సిస్టం ఉన్న వాహనాల ద్వారానే ధాన్యం తరలింపు చేసేవారు. ప్రస్తుతం ఏ వాహనంలోనైనా ధాన్యాన్నిను తీసుకెళ్ళవచ్చు.
- ధాన్యం అమ్మాలంటే గతంలో ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుని వారికి కేటాయించిన రైస్‌మిల్‌కు మాత్రమే ధాన్యం వేయాల్సి వచ్చేది. ప్రస్తుతం ఆ నిబంధనలు సడలించి రైతుకు ఇష్టమైన ఏ మిల్లుకైనా ధాన్యం అమ్ముకోవచ్చు.
- గతంలో రైసు మిల్లులకు ఉన్న బ్యాంకు గ్యారెంటీని పెంచారు. దీంతో ఎక్కువ మిల్లులు ధాన్యం కొనుగోలు చేసేందుకు అవకాశం కలిగింది.

అధికారులు పొలంబాట

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖాధికారులు సడలించిన నిబంధనలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ మేరకు శనివారం సంబంధిత అధికారులు పొలం బాటు పట్టి రైతులకు సడలింపు వివరాలు తెలియజేస్తున్నారు. తుపాను హెచ్చరిక నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు.



కృష్ణాతీరంలో పోటెత్తిన భక్తజన సందోహం



ఓంకారం ఆకృతిలో దీపాలంకరణ

కోటి దీప కాంతులతో మెరిసిన కృష్ణమ్మ

నాగాయలంక: స్థానిక కృష్ణానది తీరంలోని శ్రీరామ పాదక్షేత్రం పుష్కరఘాట్ వద్ద శనివారం రాత్రి శ్రీరామ పాదక్షేత్రం కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన కోటి కార్తిక దీపోత్సవం వైభవంగా జరిగింది. కార్తిక దీపాల వెలుగులతో కృష్ణాతీరం మెరిసి పోయింది. కార్తిక ఉపవాస దీక్షలో ఉన్న మహిళలు దీపాలు వెలిగించి పూజలు చేశారు. ఘాట్‌లో ఓమ్, శివ లింగాకారం, స్వస్తిక్, పద్మాలు, పోతురాజుస్వామి బొట్లు, వెంకన్న నామాలు, శంకు చక్రాలు తదితర ఆకృతుల్లో కూర్చిన ప్రమిదల దీపాలు ఆకర్షణీయంగా నిలిచాయి. నవ హారతులు, చిన్నారుల నృత్య ప్రదర్శన జరిగాయి.



ఇండియా మ్యాప్ ఆకృతిలో దీపాలంకరణ

నీటి సరఫరా పునరుద్ధరణ

పెదప్రోలు(మోపిదేవి): పెదప్రోలులో నీటి సరఫరాను శనివారం పునరుద్ధరించారు. ఈనెల 1వ తేదీన 'నీటి సరఫరా బంద్‌తో ఇబ్బందులు' శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. అధికారులు స్పందించి కాంట్రాక్టు సిబ్బందితో సంప్రదింపులు జరిపారు. సిబ్బందికి బకాయి జీతాలు 10 రోజుల్లో కొంతమేరకు చెల్లిస్తామని చెప్పడంతో అంగీకరించిన సిబ్బంది విధుల్లో చేరారని గ్రామ కార్యదర్శి రామకోటేశ్వరావు తెలిపారు. సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

సాక్షి స్పందన

పైడమ్మ జాతర వేలం ద్వారా రూ.15.23 లక్షల ఆదాయం

పెడన: పట్టణంలోని పైడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఈ నెల 26 నుంచి 2024 జనవరి ఐదో తేదీ వరకు జరుగుతాయి. జాతర ఉత్సవాల సమయంలో దుకాణాలు, శిడిబండ్లు, మేకపోతులు, కోళ్లు, తదితర వాటికి సంబంధించిన వేలం పాట నిర్వహించగా రూ.15,23,500 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ టీవీవీ మోహనరావు తెలిపారు. శనివారం పైడమ్మ దేవస్థానం ఆవరణలో వేలం పాటలు నిర్వహించారు. ఈఓ మోహనరావుతో పాటు దేవాదాయ శాఖ సిబ్బంది, ఆలయ అభివృద్ధి కమిటీ సమక్షంలో పాటదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ గత ఏడాది కంటే ఈ ఏడాది ఆదాయం రూ.20,500 అధికంగా వచ్చిందని వివరించారు.

కృష్ణా వర్సిటీకి విరాళం

కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయంలో మూడు రోజులు జరిగిన కృష్ణా తరంగ్– 2023 కార్యక్రమాలకు సంబంధించి మచిలీపట్నం బెరాకా మినిస్ట్రీస్ తరఫున ఆ సంస్థ నిర్వాహకుడు బ్రదర్ కిరణ్‌పాల్ రూ. లక్ష విరాళాన్ని శనివారం అందజేశారు. తమ వంతు సహాయంగా విశ్వవిద్యాలయానికి నగదు అందజేశామని కిరణ్‌పాల్ చెప్పారు. ఈ నగదును ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ కె. రాజకుమార్ చేతుల మీదుగా ఉపకులపతి ఆచార్య జి. జ్ఞానమణికి అందజేశారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

పెడన: ఓటరు నమోదుకు ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలను ఓటు హక్కుకు అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అన్నారు. శనివారం ఆమె మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాన్ని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బండారు మల్లి, సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్‌తో కలిసి సందర్శించి కొత్తగా ఎంతమంది ఓటర్లు ఫారం–6 ఇచ్చారు, ఫారం–7, 8లకు దరఖాస్తులు ఎన్ని వచ్చాయనే వివరాలను బూత్ స్థాయి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మహేంద్ర పాల్గొన్నారు.

రైతులకు లబ్ధి చేకూరేలా ధాన్యం కొనుగోళ్లు

కలెక్టర్ రాజాబాబు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): ధాన్యం కొనుగోలు ప్రక్రియను పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన చాంబర్ నుంచి క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం సేకరణలో గత ఏడాది జరిగిన అనుభవాలను దృష్టిలో పెట్టుకుని మరింత పటిష్టమైన విధానంతో సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. మొవ్వ, పామర్రు, నందివాడ మండలాల్లో వరికోతలు పూర్తయి రైతులు ధాన్యాన్ని రోడ్డు పక్కన ఆరబెట్టుకుంటున్నారన్నారు. ధాన్యం రైస్‌మిల్లులకు చేర్చేందుకు 748 జీపీఎస్ అమర్చిన వాహనాలు సిద్ధం చేశామని చెప్పారు. కొన్ని మండలాల్లో వాహనాలు అందుబాటులో లేవని అధికారులు చెబుతున్నారని, స్థానికంగా ఉన్న వాహనాలకు జీపీఎస్ అమర్చేలా రవాణా శాఖాధికారులను ఆదేశించారు. రైస్‌మిల్లర్లు రైతుల నుంచి అన్‌లోడింగ్ చార్జీలు ఎట్టి పరిస్థితుల్లో వసూలు చేయకుండా కస్టోడియన్ అధికారి నిరంతరం పర్యవేక్షించాలన్నారు. రైతులకు తాజా వాతావరణ పరిస్థితులు తెలియజేసి వారికి అవగాహన కల్పించాలని చెప్పారు. ధాన్యం రవాణాలో ఎటువంటి సమస్యలు రాకుండా లారీ సంఘ యజమానుల సంఘ ప్రతినిధులతో మాట్లాడాలన్నారు. మిల్లుల వద్ద ధాన్యం నాణ్యత, తూకం విషయంలో మిల్లర్లు రైతులను ఇబ్బంది పెట్టకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల్లో పేదలందరికీ ఇళ్ల నిర్మాణాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో నిర్మాణాలు పూర్తి చేసేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. డిసెంబరు 1 నుంచి జనవరి 31వ తేదీ వరకు ఆయా మండలాల్లో లేఅవుట్లను పరిశీలించి పనులు వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

29 మందికి ఉద్యోగాలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాలో 29 మంది అభ్యర్థులకు ఉద్యోగావకాశాలు కల్పించామని జిల్లా ఉపాధి కల్పన అధికారి దేవరపల్లి విక్టర్‌బాబు తెలిపారు. మొత్తం 73 మంది ఇంటర్వ్యూకు హాజరుకాగా పలు సంస్థల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి 29 మందికి ఉద్యోగాలు ఇచ్చారు. రిలయన్స్ రిటైల్ 12 మందికి, నవత ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ, స్మార్ట్ లింక్ కంపెనీలు ఐదుగురు చొప్పున, శ్రీ సత్యదేవ ఏజెన్సీస్ ఇద్దరికి, జన్యూన్ సెక్యూరిటీస్ సంస్థ ఇద్దరికి, సుధీర్ టింబర్ డిపో సంస్థ ముగ్గురికి ఉద్యోగ అవకాశాలు కల్పించాయని తెలిపారు. ఈ నెల 6వ తేదీన విజయవాడలోని ఉపాధి కల్పన కార్యాలయంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తామని విక్టర్‌బాబు చెప్పారు. మరిన్ని వివరాలు సెల్: 81424 16211 నంబరును సంప్రదించాలన్నారు.

ఓటు హక్కు కోరుతూ 52 దరఖాస్తులు

గూడూరు: బూత్ స్థాయిలో శనివారం నిర్వహించిన ఓటరు నమోదు కార్యక్రమంలో గూడూరు మండలానికి సంబంధించి 52 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ బి.విజయప్రసాద్ తెలిపారు. వీటితో పాటుగా తొలగింపుకు ఒకటి, సవరణలకు రెండు దరఖాస్తులు వచ్చాయన్నారు. ఆదివారం కూడా బూత్ స్థాయిలో బీఎల్‌ఓలు ప్రజలకు అందుబాటులో ఉంటారని, ఓటరు జాబితాల్లో తమ పేర్లు సరి చేసుకోవాలని ఆయన కోరారు.

విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

మచిలీపట్నంటౌన్: తుపాను ప్రభావం వల్ల వీచే గాలులు, అధిక వర్షాల సమయంలో విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండి ప్రాణ నష్టం జరగకుండా జాగ్రత్త పడాలని విద్యుత్ మచిలీపట్నం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మన్నెం భాస్కరరావు కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ వైర్లు తెగిపడితే వాటిని తాకకుండా జాగ్రత్త పడాలని, వెంటనే సమాచారాన్ని విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలన్నారు. స్తంభాలు పడిపోతే లైన్‌మెన్లకు, సబ్‌స్టేషన్‌లో సిబ్బందికి, ఏఈకి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. గాలులకు విద్యుత్ పరికరాలను ఆఫ్ చేసుకుని స్విచ్‌బోర్డులోని ప్లగ్‌లను పూర్తిగా తీసివేయాలని చెప్పారు.

ఉపాధి పనులపై బహిరంగ విచారణ

కోడూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులపై శనివారం సామాజిక తనిఖీ ప్రజా వేదిక ద్వారా బహింగ విచారణ నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గ్రామసభ జరిగింది. మండలంలోని 13 పంచాయతీల పరిధిలో ఏడాది వ్యవధిలో రూ.9.84 కోట్ల పనులు నిర్వహించామని పీఓ నాంచారయ్య తెలిపారు. పనులపై ఫీల్డ్ అసిస్టెంట్లు, కూలీలు, లబ్ధిదారులు, ఆయా శాఖల సిబ్బందిని విచారణ చేసి రూ.1.07 లక్షల రికవరీకి ఆదేశించామని చెప్పారు. వివిధ పనుల నిమిత్తం ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.18 వేల ఫైన్ విధించామని తెలిపారు.

కళల్లో ప్రతిభ చూపితే జీవితంలో రాణించినట్లే

కోనేరుసెంటర్: కళలు, సాంస్కృతిక రంగాల్లో రాణించిన ప్రతి ఒక్కరూ జీవితంలో రాణించగలుగుతారని మచిలీపట్నం పోర్ట్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ మేకతోటి దయాసాగర్ అన్నారు. శనివారం కృష్ణా విశ్వవిద్యాలయంలో కృష్ణా తరంగ్–2023 ముగింపు కార్యక్రమంలో ఆయన అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకునేందుకు కమ్యూనికేషన్ స్కిల్స్ ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. మూడు రోజుల పాటు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందించారు. విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి. జ్ఞానమణి మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయంలో 37 ఏళ్లు పనిచేసినప్పటికీ ఈ ఏడాది నిర్వహించిన కృష్ణా తరంగ్ – 2023 జీవితాంతం మధురస్మృతిగా గుర్తుండిపోతుందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. ఓవరాల్ చాంపియన్‌గా విజయవాడ పీబీ సిద్ధార్థ కళాశాల నిలవగా, మొదటి రన్నరప్‌గా విజయవాడ దుర్గామల్లేశ్వరి మహిళా కళాశాల, రెండో రన్నరప్‌గా విజయవాడ నలందా కళాశాలలు నిలిచాయి. శాసన సభ డెప్యూటీ కార్యదర్శి కె. రాజ్‌కుమార్, బందరు ఆర్డీఓ వాణి, రిజిస్ట్రార్ డాక్టర్ వీరబ్రహ్మాచారి, డాక్టర్ ఎం. కోటేశ్వరరావు, ఆచార్య సుందరకృష్ణ పాల్గొన్నారు.